# సింహావలోకనం

-డా. శ్రీమతి కొఠారి వాణీచలపతిరావు

''భానూ! భానూ ఏం చేస్తున్నావోయ్ లోపల.''

భర్త కంఠంలోని 'భానూ' అన్న ఆ పిలుపునకు ఒక్కసారి ఉలిక్కిపడి బెదురుగా చుట్టూ చూసింది ఆమె.

నవ్వుతూ వంటింట్లోకి వస్తున్న భర్త వంక కోపంగా చూస్తూ,

''అవ్వ. ఎవరన్నా వింటే నవ్విపోతారు. ఏమిటా పిలవటం'' అంది బుగ్గలు నొక్కుకుంటూ.

''ఎవరు వినటం లేదులేవోయ్. ఇంట్లో ఎవ్వరూ లేరు. అందుకే నిన్ను అలా పిలిచాను. 'భానూ' అని పిలిచి చాలా రోజులయింది కదా. ఈరోజు ఎందుకో మళ్ళీ అలా పిలవాలని అనిపించింది. అవునుగానీ ఈరోజుకు ఒక ప్రత్యేకత వుంది. అదేంటో చెప్పు.''

''ప్రత్యేకతా..ఏమిటది?''

''ఏమిటో నిన్నే చెప్పమంటున్నాను.''

''ఏమో..నాకు తెలియదు. మీరే చెప్పండి.''

''చెప్పనా...చెప్పనా. అయితే విను. ఈరోజు..ఈరోజు నీ పుట్టిన రోజు. హాపీ బర్త్‌డే టూ యూ''

అంటూ అంతవరకూ వెనక దాచిన చేతుల్లోని పేకెట్ భార్య చేతిలో వుంచాడు ఆయన.

ఈసారి పూర్తిగా బెదిరిపోయింది ఆమె. 'ఎవరన్నా అకస్మాత్తుగా వచ్చి ఇది చూస్తే ఎంత సిగ్గుచేటు' అన్నట్లు భయం భయంగా చూసింది.

''నీకు పుట్టిన రోజు బహుమతులిచ్చి చాలా సంవత్సరాలు అయింది. పెళ్ళయిన కొత్తలో ప్రతి పుట్టిన రోజుకు కొత్తచీర చేతిలో పెట్టి అమాంతం ఎత్తుకుని చేతుల మీద గిరగిరా తిప్పేవాణ్ణి. నువ్వు లబోదిబోమని మొత్తుకుంటూ 'అయ్యో..అయ్యో..కళ్ళు తిరుగుతున్నాయి వదిలిపెట్టండి' అనేదాకా కిందికి దింపేవాడ్ని కాదు. ఆ తర్వాత ముద్దులతో నిన్ను ముంచెత్తేవాణ్ని. ఇప్పుడు నిన్నెత్తుకునే శక్తిలేదు. ముద్దుల్లో ముంచేసే ఓపిక లేదు గానీ..ఒక్కసారి ఇలా దగ్గరికి రావోయ్'' అంటూ భార్యను దగ్గరికి తీసుకొని గుండెలకు హత్తుకొని కౌగిలించుకుంటూ నుదుటిమీద సుతారంగా ముద్దుపెట్టుకున్నాడు.

''అవునుగానీ....ఈ పుట్టిన రోజుకు నీ వయసు ఎంతేమిటోయ్''

''ఎంతో మీకు తెలియదా. మీ వయసులో నుంచి నాలుగేళ్ళు తీసేయండి.''

''అవునుకదూ.'' అని మనసులో ఒక్క నిముషం లెక్కవేసుకుని ''ఇప్పుడు నీకు డెబ్బయి ఐదు సంవత్సరాలు. నాకు డెబ్బయి తొమ్మిది. అవునా?''

''అవును. అందుకే ఇందాకటి నుంచి మీ చేష్టలు చూసి ఆశ్చర్యపోలేక చస్తున్నాను. ఇన్నేళ్ళు వచ్చాయి ఇంకా కొత్తగా పెళ్ళయిన కుర్రాడిలా ఏమిటిది. ఎవరన్నా చూస్తే ఇంకేమయినా వుందా.''

''ఎవరూ చూడటం లేదని చెప్పానుగా. ఈ జీవిత చరమాంకంలో పొద్దుపోక దిండుకానుకుని కూర్చుంటే మనసు నాకు తెలియకుండానే గతంలోకి వెళ్ళిపోతుందోయ్. మన పెళ్ళయిన కొత్తరోజులు గుర్తొస్తాయి. పిల్లలు పుట్టడం, వాళ్ళ బాల్యం-వాళ్ళ పెళ్ళిళ్ళు అన్నీ రివైండ్ చేసిన వీడియో సినిమా రీలులా కళ్ళముందు నుండి కదిలిపోతూ వుంటాయి.'' అన్నాడు ఆయన తన్మయత్వంతో కళ్ళుమూసుకుంటూ.

ఆయన పేరు రామచంద్రరావు.

ఆమె పేరు భానుమతమ్మ.

వాళ్ళకు నలుగురు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు.

పద్దెనిమిది మంది మనవళ్ళు, మనవరాళ్ళు. ఓ అరడజను మంది మునిమనవరాళ్ళు, మనవళ్ళు వున్నారు.

ఒక తల ముగ్గుబుట్ట అయితే మరోతల బట్టతల స్థితిని కూడా దాటి గుండు దశకు చేరుకుంది.

ఒకటి బోసినోరయితే మరొకటి తొస్సినోరు.

ఒకరికి మోకాళ్ళ కలకలయితే మరొకరికి అరికాళ్ళ మంటలు.

వెరసి భానుమతమ్మ, రామచంద్రరావులు అవుతారు.

వారిద్దరికీ వయసు పొద్దు కుంకిపోయింది. సమీపంలోనే మృత్యువు వెన్నంటివస్తూ సమయం కోసం శివుని ఆజ్ఞ కోసం వేచి చూస్తూ వుంది.

జీవితం సంధ్యారాగం పాడుతూ వుంది.

★★★

''ఇంత వయసొచ్చినా ఇంకా వెనకటి అందం నీలో ఏదో మూల నుంచి తొంగి చూస్తూనే వుందే. ముఖం ముడుతలు పడ్డా కళ్ళల్లో ఆ మెరుపు తగ్గలేదు. పెళ్ళి చూపులనాడు నన్ను ఆకర్షించి మోహింప చేసింది చేపల్లాంటి పెద్ద పెద్ద ఆ కళ్ళేకదా-'' అన్నాడు రామచంద్రరావు భార్య కళ్ళళ్లోకి అతికష్టంమీద ఆసక్తిగా చూస్తూ.

''ఆ అన్నట్లు కళ్ళంటే గుర్తొచ్చింది కళ్ళల్లో శుక్లాలు వేసి మీకు సరిగా చూపు ఆనటం లేదు కదా..ఒకసారి ఆ కళ్ళ డాక్టరు దగ్గరికి వెళ్ళి అవి ముదిరితే ఆపరేషన్ చేస్తారేమో కనుక్కోకూడదూ..'' అంది భానుమతమ్మ, పత్తికాయల్లా మారిపోతున్న భర్త కళ్ళవంక జాలిగా చూస్తూ.

''వెళ్తాలే. ఒక్కడ్నే ఏం వెళ్ళను. నువ్వు కూడా రా. రిక్షా కట్టించుకొని వెళ్దాం. శుశ్రుతా నర్సింగ్ హోంలో అన్ని రకాల డాక్టర్లూ ఒకే దగ్గర వుంటారు. మిగిలిన నాలుగు పళ్ళు కూడా కదులుతున్నాయని అంటున్నావుగా. పీకించుకుందువుగాని....'' అన్నాడు సీరియస్‌గానే అన్నా బోసినోటి తాతమ్మ కాబోతున్నందుకు భార్యను ఉడికిస్తూ.

''ఈ వయసులో ఒకే రిక్షాలో పక్కపక్కన కూచుని బజారులో ఊరేగింపుగా వెళ్తే జనం నవ్విపోతారు.''

''ఎందుకు నవ్వుతారు. మనమేమన్నా సినిమాకో, షికారుకో వెళ్తున్నామా. డాక్టరు దగ్గరికే కదా''

''ఆ విషయం అవతలి వాళ్ళ కెలా తెలుస్తుంది. తెలిసినా హర్షించరు. ముసలమ్మ, ముసలయ్య ఈ వయసులో జంటగా షికార్లు కొడుతున్నారు'' అని నవ్విపోతారు.

''ఏ వయసయితే ఏంటి. మనం భార్యాభర్తలం కాకపోయామా''

''ఇదిగో ఇలా అంటూనే ఆరోజు బర్త్‌డే అంటూ చీర తెచ్చారు. నన్ను దగ్గరికి తీసుకోవటం ఎప్పుడు చూసిందో మనవరాలు రాణీ చూసి వాళ్ళమ్మకు చెప్పింది. చిన్నకోడలు బెడ్‌రూమ్‌లో నుండి కావాలని నేను వినాలనే పెద్దగా కొడుకుతో

''ఛీ...ఛీ..సిగ్గులేకపోతే సరి..ఇన్నేళ్ళొచ్చి కొత్తదంపతుల్లా సరసాలాడుకుంటున్నారు. ఇంట్లో వయసొచ్చిన మనవళ్ళు, మనరాళ్ళు తిరుగుతున్నారన్న ఇంగితమైనా వుండాలి'' అంటుంటే నేను సిగ్గుతో చితికిపోయాను.''

''ముసలివాళ్ళం అయిపోతే మాత్రం మనకు అనుబంధాలూ, ప్రేమలూ వుండవా. ఇన్నేళ్ళుగా ఒక యింట్లో కలిసి బతుకుతూ కష్టంలో సుఖంలో తోడు నీడగా వుంటున్నవాళ్ళం. ఈరోజు మనవళ్ళు, పుట్టుకొచ్చారని ఆ బంధం పుటుక్కున తెగిపోవాలా? వయసు మీద బడ్డ దంపతుల మధ్య వుండేది శరీరవాంఛ కాదని, కాలంతోపాటు పటిష్టమైన

హృదయ సంబంధమని పెద్ద పెద్ద చదువులు చదివిన ఈ కాలం మనుషులు ఎందుకు అర్థం చేసుకోరు.

వాళ్ళు మాత్రం రేపు ముసలివాళ్ళు కారా. అప్పుడు వాళ్ళకు అనుభవానికి రాకుండా పోతుందా ఈ విషయం?'' కొద్ది ఆవేశం, మరికొంత నిష్ఠురం కలగలసిన గొంతుతో అన్నాడు రామచంద్రరావు.

''పోనీండి పిల్లలు. వాళ్ళ వయసుకు తగ్గ ఆలోచనలు వాళ్ళవి. మనలోకి పరకాయ ప్రవేశం చేసి చూడలేరు కదా వాళ్ళు. అందుకే మన వయసుకు తగ్గట్టు మనం పెద్దరికంగా వుంటే ఈ తిప్పలు వుండవు కదా.''

''అది కాదే భానూ....''

''అదిగో మళ్ళీ 'భాను' ఎప్పుడో మర్చిపో యిన పిలుపు అది. నడివయసు నుండీ 'భానుమతీ' అని పూర్తి పేరుతో పిలిచారు. మనవళ్ళు, మునిమనవళ్ళు వచ్చాక అసలు పేరుతో కూడా అవసరం లేకుండా పోయింది. మీ బామ్మ- మీ అమ్మమ్మ అని మనవళ్ళతో, 'మీ అమ్మ'- మీ అత్తగారు' అని కొడుకు, కోడళ్ళతో ఏ పనికావాలన్నా రాయబారాలు పంపిం చేవాళ్ళు. ఇప్పుడు ఇన్నేళ్ళ తర్వాత ఈ వయసులో అలా పిలిస్తే ఎబ్బెట్టుగా వుండదూ..''

''ఏమో.అదేమీ నాకు తెలియదుగానీ ఒక్కసారి గడిచిన కాలం మళ్ళీ ఇప్పుడు తిరిగి వస్తే బాగుండునని అనిపిస్తుంది. కాలచక్రం ముందుకే గానీ వెనక్కు తిరగదు కదా..'' నిరాశ ధ్వనించింది రామచంద్రరావు కంఠంలో.



''ఎందుకు మళ్ళీ యువకులై పోవాలని ఆశా వుందా. ఆ కాలంలో ఆరడుగుల అందమైన హీరో అని తమకు పేరు కదా. నడుము వంగి ఆరడుగులు ఐదడుగులకు ఇప్పుడు కుంగిపోయింది గానీ లేకుంటే మీకు పట్టపగ్గాలు వుండేవా..''

''నిష్ఠూరంగానే అన్నా నిజం చెప్పావోయ్ భానుమతీ. మా ఊరంతటికీ నేనొక్కడ్నే అందగాడ్ని అని పేరు. వయసొచ్చి పమిటలేసుకోవటం మొదలుపెట్టిన ప్రతి ఆడపిల్ల నేనంటే పడిచచ్చేది. పెళ్ళి చేయకుండా వదిలేస్తే నేను గోపాలకృష్ణుని లెవల్లో ఎక్కడ పెరిగిపోతానో అని భయపడి మా నాన్న నా ముక్కుతాడు వేయటం కోసం నిన్ను కట్టబెట్టాడు.''

''మరి ఇందాక...పెళ్ళి చూపుల్లో నా అందమైన కళ్ళు చూసి మోహించి చేసుకున్నానని చెప్పారు.'' మూతి విరుస్తూ అంది భానుమతమ్మ.

''నిన్ను చూసాక నువ్వు నచ్చావు. చూడకముందు సంగతి నేను చెప్పేది. 'పెళ్ళి' అన్న రెండక్షరాల్లో ఎంతటి బలం వుందో తెలియటానికి మన కాపురమే ఒక నిదర్శనం. ఆనందం అంచులు చూశాం- సంసారసాగరంలో మునిగి తేలాం. పండంటి పిల్లల్ని కన్నాం. పెద్దమ్మాయి పుట్టినప్పుడు ఇంట మహాలక్ష్మి వెలిసిందని మురిసిపోయాం. నీ రెండో కాన్పులో మన 'రఘు'కు జబ్బు చేస్తే ఎంతగా తల్లడిల్లిపోయాం. లాభం లేదని డాక్టరు చెబితే ఒకళ్ళనొకళ్ళం కౌగలించుకొని ఎంతగా ఏడ్చాం- దేవుడి దయవల్ల వాడు బ్రతికి బట్ట కట్టాడు. మూడో కాన్పులో'' అని రామచంద్రరావు ఏదో చెప్పబోతుంటే అంతవరకూ ఏదో సీరియస్‌గా ఆలోచిస్తున్న భానుమతమ్మ కళ్ళు ఒక్కసారిగా జలజలా వర్షించసాగాయి. పమిట చెంగుతో కళ్ళు అద్దుకుంటున్న ఆమె వంక చూసి ఖంగారు పడిపోయాడు రామచంద్రరావు.

''ఏమయింది భానుమతీ. ఎందుకు ఏడుస్తున్నావు?'' అన్నాడు ఆశ్చర్యంగా.

''ఏమీ తెలియనట్లు నంగనాచిలా ప్రశ్నిస్తున్నారే. హాస్పటల్స్ సౌకర్యంగా లేవని నేను మూడో కాన్పుకు మా అక్కయ్య గారింటికి వెళ్ళాను. అప్పుడు మీరు..మీరు..ఏం చేసారు..'' దుఃఖం తన్నుకొస్తుండగా అంది భానుమతమ్మ.

''నేనేం చేసాను. ఏమీ చేయలేదు మొర్రో అని ఇరవై సంవత్సరాలుగా చెబుతున్నా ఇంకా ఈనాటికీ నీ అనుమానం తీరదేమిటే...''

''ఏమీ చేయకపోతే మీ పక్కమీద ఆ వాడిన మల్లెపూల దండ ఎలా వచ్చింది.''

''ఈ ప్రశ్నకూ సమాధానం చెబుతూనే వస్తున్నాను. ఆరోజు మా ఫ్రెండ్ ఒకతను వాళ్ళ మూడేళ్ళ పాపతో మనింటికి వచ్చాడని, ఆ అమ్మాయి

చాలా అల్లరి పిల్ల అని, ఇల్లంతా తిరిగి ఆడుకుంటూ మన మంచం మీద పడి పొర్లిన సందర్భంలో ఆ అమ్మాయి పోనీటేల్‌లో నుండి ఊడిపడిన దండ కావచ్చని చెబుతూనే వున్నాను. అయినా నువ్వు నమ్మటం లేదు. నేనేం చేయను.'' నిస్సహాయత కంఠంలో ధ్వనిస్తుండగా అన్నాడు రామచంద్రరావు.

''ఇలాంటి విషయాల్లో ఏమగాడు మాత్రం నిజం ఒప్పుకుంటాడు లెండి. మన పక్కింట్లో వనజ అని ఒకావిడ వుండేది. మీకు ఆవిడ అందం మీద మోజు. అందుకే అదే పనిగా ఆవిడను మెచ్చుకుంటూ..ఆవిడ నాజూకుతనం చూసి లొట్టలేసేవారు. నా అనుమానం నేను లేనప్పుడు ఆవిడే మనయింటికి వచ్చి వుంటుందని'' కళ్ళనీళ్ళ పర్యంతం అవుతూ అంది భానుమతమ్మ.

''నన్ను అనుమానిస్తే అనుమానించావుగానీ పాపం ఆ ఉత్తమ ఇల్లాలి మీద ఎందుకే అభాండాలు వేస్తావు. నిన్ను ఉడికించడం కోసమని ఆమె అందాన్ని పొగిడేవాడిని. అంతేగానీ జీవితంలో ఇంత వరకు నిన్ను తప్ప మరో ఆడదాని ముఖం చూడలేదు. సత్య ప్రమాణంగా చెబుతున్నాను.''

భర్త మాటలు వింటుంటే నిజమేనేమో అని నమ్మబుద్ధి అవుతుంది భానుమతమ్మకు. కానీ అంతలోనే మళ్ళీ అనుమానం.

ఏమిటో! ఎంత వయసొచ్చినా 'తన భర్త కేవలం తనవాడే' నన్న భావం, మరొకరు ఎక్కడ స్వంతం చేసుకుంటారోనన్న భయం ఆడవాళ్ళని వదిలి పెట్టవుకదా.

''భానుమతీ'' అని భర్త ఏదో చెప్పబోయేసరికి మధ్య హాల్లో అడుగుల చప్పుడయింది.

''ఎవరో వస్తున్నట్లున్నారు. మన ఇద్దరం ఇలా కబుర్లు చెప్పుకోవడం చూస్తే కోడలి పిల్ల మళ్ళీ ఏదో అంటుంది. నువ్వు వెళ్ళిపడుకో. పిచ్చి ఆలోచనలతో మనసుపాడు చేసుకొని ఏడుస్తూ పడుకోకు. కళ్ళనీళ్ళు పెట్టుకున్నావంటే నామీద ఒట్టే. మనసులో మాట చెబుతున్నాను. నువ్వంటే నాకు ప్రాణం. నువ్వు అనుమానించినా, నిష్ఠూరాలాడినా, తిట్టినా భరిస్తానుగానీ నాతో మాట్లాడకుండా మౌనంగా వుంటే మాత్రం భరించలేను. జీవితాంతం ఇలా నీతో కబుర్లు చెబుతూ నీకు సన్నిహితంగా ఉండిపోవాలని ఉంటుంది నాకు. కానీ ఈ ఇంట్లో మాట్లాడుకోవటానికే కుదరదు. ఒక పని చేద్దాం. రేపు గుడికెళ్తున్నానని చెప్పి నువ్వు రామాలయం దగ్గరికి వచ్చెయ్. నేనూ ఏదో వంకతో అక్కడికి వస్తాను. అక్కడ కూర్చుని కరువుతీరా కబుర్లు చెప్పుకుందాం. సరేనా.'' అని అడుగుల చప్పుడు దగ్గర కావడంతో పిల్లిలా లేచి వెళ్ళిపోయాడు రామచంద్రరావు.

ఆ దంపతుల ఏకశయ్య ద్విశయ్యగా చీలి ఎన్నో సంవత్సరాలు అయింది. హాల్లోకి మారిపోయాయి.

హాల్లో అయినా కనీసం మంచాలు పక్క పక్కన వేసుకుని భార్యతో కబుర్లు కలబోసుకోవాలని వుంటుంది రామచంద్రరావుకి. భానుమతమ్మకైతే అలా మాట్లాడుతుంది గానీ భర్త పక్కన వుంటే ఆమెకూ కొండంత అండ వున్నట్లు అనిపిస్తుంది. కానీ ఇద్దరిలో ఎవరూ అడగలేరు. బిడియం, సంకోచం, ఏమనుకుంటారోనని భయం. అడగకుండా వాళ్ళ మనసులను అర్థం చేసుకోలేరు కొడుకులు, కోడళ్ళు. పడుచు జంటలలాగే ముసలి దంపతులకూ ప్రైవసీ అవసరం వుంటుందని ఈ పిన్నలకు ఎందుకు తోచదు అసలు. ఒకటా, రెండా కొన్ని సంవత్సరాలుగా మనసారా మాట్లాడుకోవటానికి కూడా వీలులేకుండా, కళ్ళారా ఒకరినొకరు చూసుకోవటానికి కూడా సాధ్యం కాకుండా వాళ్ళు విడివిడిగా పడుకుంటున్నారు. ఒక ఇంట్లో వుంటూ పరాయివాళ్ళుగా బ్రతుకు తున్నారు.

భానుమతమ్మకు భర్త రామచంద్రరావుని ఆయనకు తనమీదవున్న ప్రేమను తలుచుకుంటూంటే మనసంతా ఆర్ద్రంగా తీయగా మారింది.

'రేపు ఎలాగయినా గుడికి వెళ్ళాలి. ఆయనని దగ్గరి నుండి చూడాలి. తన దేవుడు ఆయనేగా. ఆ దేవుడి కన్నా ఈ దేవుణ్ణి చూస్తేనే తన జన్మ ధన్యమవుతుంది. మాట్లాడితే తనకు బ్రహ్మానందం కలుగుతుంది.' అనుకొని పడుకున్న తర్వాత తృప్తిగా నిద్రపోయింది భానుమతమ్మ.

★★★

కబుర్లు చెప్పుకోడానికి మర్నాడు సాయంత్రం రామచంద్రరావు దంపతులు గుడికెళ్దాం అనుకున్నారు గానీ వెళ్ళలేకపోయారు. కారణం వాళ్ళకు ఆరోజు ఉదయం పక్కమీద నుంచి లేస్తూనే చావు కబురు ఒకటి వచ్చింది. కొంచెం దూరపు బంధువు అయినా మంచి మిత్రులు అయిన ముకుందరావుగారు హార్ట్ ఎటాక్ వచ్చి మరణించారు. ఆయన వయసు డెబ్భై సంవత్సరాలు. రామచంద్రరావు, భానుమతమ్మ హడావుడిగా రిక్షా కట్టించుకుని చావు ఇంటికి బయలుదేరారు.

రిక్షా దిగుతూనే అక్కడ కనిపించిన వాతావరణం చూసి ఆ ఇద్దరి గుండెలు దిగులుతో అదో విధంగా మారిపోయాయి. ఇంటిముందు దీనవదనాలతో గుంపులు గుంపులుగా మగవాళ్ళు నిల్చొని వున్నారు. లోపలి నుండి ఆడవాళ్ళ రోదన ధ్వనులు వినవస్తున్నాయి.

మధ్యహాల్లోకి అడుగుపెడుతూనే తెల్లటి బట్ట కప్పిన ముకుందరావుగారి పొడవాటి భౌతికకాయం కనిపించింది. శవం మీద పడి హృదయ విదారకంగా రోదిస్తున్నది ఆయన భార్య శకుంతలమ్మగారు. ఆమెను చూస్తే పాపం ఆవిడకు ఏడ్చే ఓపిక కూడా లేదేమో అనిపిస్తున్నది. వయసును మించిన వృద్ధాప్యంతో కండలు తరిగిపోయి, చర్మం ఎక్కడిదక్కడ వేళ్ళాడుతూ ఎముకల గూడులా వుంది ఆమె.

ఆమెను చూస్తుంటే భానుమతమ్మ గుండెలు భయంతో దడ దడలాడటం మొదలుపెట్టాయి. ఎంత వద్దనుకున్నా మనసు తన అదుపుతప్పి ఏదేదో కీడును ఆలోచించటం మొదలుపెడు తున్నది.

ఇలాంటి దుస్థితి కొద్ది రోజులలో తనకు కూడా రాబోతుందేమోనన్న ఆలోచన ఆమె మనసులో మెదిలి కళ్ళముందు అచ్చం అలాంటి దృశ్యాన్నే నిలబెట్టడం మొదలు పెట్టింది. తన భర్త రామచంద్రరావు శరీరం అలా నేల మీద తెల్లటి బట్ట కప్పబడి పడుకోపెట్టినట్లు, తను ఆ దేహం మీద పడి రోదిస్తున్నట్లు... వెంటనే ఉలిక్కిపడి వాస్తవానికి వచ్చిన భానుమతమ్మ 'ఛీ! ఛీ పాడు ఆలోచన. ఎంత వద్దనుకున్నా ఎందుకిలా కీడు శంకిస్తుంది మనసు' అని తనను తానే నిందించుకుని శరీరాన్ని, మనసును అదుపులో పెట్టుకొని స్థిమితంగా కూర్చుంది.

ముకుందరావు శవం పక్కన గోడకానుకుని కూర్చుని తదేకంగా



## పవన్‌కి పబ్లిసిటీ

ఇప్పటివరకూ మెగాస్టార్‌కి తన కెరీర్ గురించి దిగులు మాత్రమే వుండేది. కానీ ఇప్పుడు ఆయనకు తన కెరీర్‌తోపాటు తమ్ముడు పవన్ కళ్యాణ్‌ని ఇండస్ట్రీలో నిలబెట్టవలసిన బాధ్యత అదనంగా వచ్చి పడింది. 'అక్కడ అమ్మాయి... ఇక్కడ అబ్బాయి' సినిమా తీసే టైమ్‌లో కళ్యాణ్ చిరంజీవి తమ్ముడు అనే ఉద్దేశ్యంతో జనం విరగబడి చూస్తారనే భ్రమలో వుండేవాళ్లు. ఆ చిత్రం ఢమాల్‌మని పేలిపోవడంతో వాళ్లు కొద్దిరోజులవరకూ షాక్‌గా వుండిపోయారు. అందుకే మెగాస్టార్ బాణీ మార్చి తనకు హిట్లర్‌తో ఊరటనిచ్చిన ముత్యాల సుబ్బయ్యకు తమ్ముడికి హిట్ అందించే బాధ్యత అప్పగించాడు. 'గోకులంలో సీత' బిలో యావరేజ్ సినిమాగా మిగిలిపోయింది. ఇప్పుడు పవన్ కళ్యాణ్ 'సుస్వాగతం' చిత్రంలో హీరోగా చేస్తున్నాడు. ఈ చిత్ర దర్శకుడు భీమనేని టాలెంటెడ్ దర్శకుడుగా ప్రూవ్ చేసుకున్నాడు కాబట్టి చిత్రం హిట్టయ్యే అవకాశం చాలావరకు వుంది. ఏదేమైనా పవన్ కళ్యాణ్‌ని హీరోగా నిలబెట్టాలనే తాపత్రయంతో చిరంజీవి తనకు తెలిసిన జర్నలిస్టులందరినీ పవన్ గురించి బాగా రాయండని కోరుతున్నాడట.

-జె.వి.బాబు

కన్నురెప్పవేయకుండా ఆయన ముఖం వంకే చూస్తున్నాడు రామచంద్రరావు.

అచ్చం నిద్రపోతున్నట్లుగా వుంది ముకుందరావు ముఖం. కానీ అది మామూలు నిద్ర కాదు. శాశ్వత నిద్ర.

ముకుందరావు వయసు డెబ్బైయి సంవత్సరాలే. అంటే తన కన్నా చిన్నవాడు. అంటే... అంటే తను కూడా కొద్ది రోజుల్లో ఇప్పుడు ముకుందంలాగే ఆరడుగుల పొడుగు నేలమీద మృతుడై పడుకొని వుంటాడు.

భానుమతి తన శవం మీద పడి ఏడుస్తుంటుంది.

అసలు మరణించిన వాళ్ళు ఏమవుతారు? ఎక్కడికి వెళతారు? ఆత్మ అనేది వుందా అసలు. పునర్జన్మ అనేది వుంటే మళ్ళీ తను ఎక్కడో అక్కడ జన్మిస్తాడా.' అన్న ఆలోచనలు రామచంద్రరావులో భయాన్ని, వైరాగ్యాన్ని నింపాయి.

ఆడవాళ్ళంతా ఒక్కసారిగా గొల్లున ఏడ్చారు.

ముకుందరావు శరీరాన్ని పాడెమీదికి చేర్చటానికి మనుషులు వచ్చారు. రామచంద్రరావు ఆలోచనలు సడన్ బ్రేక్‌తో ఆగిపోయాయి.

శవాన్ని అటు స్మశానానికి తీసికెళ్ళగానే రామచంద్రరావు దంపతులు యిటు ఇంటికి వచ్చారు.

స్నానాలు చేసి కుర్చీలో చేరగిలబడి కోడలు అందించిన వేడి 'టీ' తాగారు.

ముకుందరావు రోజుకు ఆరుకప్పుల టీ తాగేవాడు. సమయానికి 'టీ' రాకపోతే ఆయన ప్రాణాలు తపించిపోయేవి. అలాంటిది ఇప్పుడు 'తన అవసరాలు, తపనలు ఈరోజుతో సరి' అన్నట్లు మనిషే కనిపించకుండా పోయాడు.

చావు ఇంటి నుండి వచ్చినప్పటి నుండి రామచంద్రరావు, భానుమతమ్మ మనసులు వెలితిగా వున్నాయి.

ఆ రోజు చీకటి పడుతున్నదంటే రామచంద్రరావు గుండెల్లో ఏదో భయం, గుబులు ప్రారంభమయ్యాయి. ఇంట్లో అందరూ భోజనాలు ముగించి ఎవరిపక్కల మీదికి వాళ్ళు చేరుకుంటున్నారు. పడుచు జంటల బెడ్ రూము తలుపులు మూసుకున్నాయి. కొడుకులు, కోడళ్ళు లైట్లార్పి మంచాల మీదికి చేరారు. రామచంద్రరావు వసారాలో నుండి తన మంచం తెచ్చుకుని హాల్లో భార్యపక్కన వేసుకున్నాడు. భాను మతమ్మ భర్త చర్యకు ఆశ్చర్యపోయింది.

''ఇదేమిటండీ ఈరోజు నా పక్కన వేసుకున్నారు. ఎవరయినా చూస్తే-''

''ఏమీ అనుకోరు.పడుకో. ఇక నుండి నేను ఇలాగే పడుకుంటాను.'' ఆయన మాటల్లో ధృడనిశ్చయం కనిపించింది.

అప్పుడు భర్త మనస్థితి అర్ధ మయింది ఆమెకు. ఆ రోజు నిజానికి ఆమె పరిస్థితీ అలాగే వుంది.

ఒంటరిగా పడుకోవాలంటే ఏదో దిగులు.

భర్త తోడును ఆమె మనసూ కోరుకుంటోంది.

ఆయన బయటికి వ్యక్తం చేస్తున్నాడు. ఆమె తన ఆలోచనలను మనసులోనే గోప్యంగా దాచుకుంటున్నది. అంతే తేడా.

ఆయన మంచం లోపలికి రావటం ఆలస్యం ఏదో కొంపమునిగిపోయినట్లు గగ్గోలు పెట్టాడు మనవడు వేణు.

''తాతయ్యా! ఇదేమిటి నీ మంచం లోపలికి తెచ్చావు. ఇంత చిన్నహాల్లో రెండు మంచాలు వేస్తే మాకు తిరగటానికి జాగా ఏదీ'' అన్నాడు విసుగ్గా.

''తాతయ్యా! ఈరోజు టి.విలో క్రికెట్ మ్యాచ్ వుంది. మీరిద్దరూ హాలంతా ఆక్రమించుకుంటే మేం ఎక్కడ కూచుని చూడాలి. అయినా ఈ వయసులో నువ్వు బామ్మపక్కన పడుకోకపోతే వచ్చిన నష్టం ఏమిటట!'' అని ముసిముసి నవ్వులు నవ్వుతూ అన్నాడు మరో మనవడు రాజా.

రామచంద్రరావుగార్కి మళ్ళీ మంచం బయటికి పట్టుకెళ్ళక తప్పలేదు.

భానుమతమ్మ ప్రాణం ఉసూరుమంది. ఆమె మనసంతా భర్తమీది జాలితో నిండిపోయింది.

వృద్ధులమైనా తాము దంపతులమని కొన్ని దశాబ్దాలపాటు శరీరాలు, మనసులు ఒకటై బ్రతికిన వాళ్ళమని వాళ్ళు ఆలోచించలేరు. పిల్లల చదువులు, పెళ్ళిళ్ళు, మనవలు, మనవరాళ్ళ పుట్టుకలు వాళ్ళ వేడుకలు, వ్యాధులు వంటి సంసార జంఝాటంలో పడి చాలాకాలం పాటు తమ సుఖాన్ని, తమ స్వార్ధాన్ని మర్చి పోయారు. ఇప్పుడు ఇన్ని సంవత్సరాల తర్వాత జీవితం పడమటి దిక్కుకు వాలిపోతున్న ఈ ఆఖరి రోజుల్లో ఈ మధ్యనే మళ్ళీ తమని గురించిన ఆలోచనలు వస్తున్నాయి. క్షణక్షణం వెన్నంటి తిరుగుతూ తన ఉనికిని మాటిమాటికీ గుర్తుచేస్తున్న మృత్యువు ఎప్పుడూ తనను భార్య సన్నిధిని కోరుకునేలా చేస్తున్నది. తామిద్దరిలో ఎవరిని వదిలి ఎవరిని మృత్యుదేవత చెప్పా పెట్టకుండా ఎత్తుకుపోతుందో ననే భయం. ఈ ముసలితనంలో మాకెందుకు ఈ ఎడబాటు. ఇలా రాత్రంతా ఆ నవారు మంచం మీద పడుకొని మథన పడ్డాడు రామచంద్రరావు. ఇద్దరూ ఒకేసారి జంటగా పైలోకాలకి వెళ్ళాలని వున్నా అది అయ్యేపని కాదని ఇద్దరికీ తెల్సు.

★★★

తెల్లవారు ఝామున నిద్రలేచినప్పటి నుండి రామచంద్రరావు ఎందుకో హుషారుగా వున్నాడు. ఒంట్లో ఏదో కొత్తశక్తి వచ్చినట్లు పెద్ద పెద్ద అడుగులు వేస్తూ ఇంటిముందు పచార్లు చేసాడు.

ముఖం ప్రసన్నంగా వుంది. కళ్ళు మాటిమాటికీ గోడగడియారం వంక చూస్తున్నాయి.

పది గంటలు కావడం ఆలస్యం ఏదో పెద్ద పనివున్నట్లు షర్టు వేసుకొని బజారుకు బయల్దేరాడు.

''భోజనం చేసిపోండి'' అని కోడలు వెనకనుండి అంటున్నా పట్టించుకోలేదు. ఆయనకు కడుపు నిండుగా వుంది.

వెళ్ళిన గంటలో తిరిగి వచ్చాడు రామచంద్రరావు.

పెద్దకొడుకును పిలిచి ఇంట్లో అందరూ వినేటట్లుగా ''నేనూ మీ అమ్మా తీర్థయాత్రలకు వెళుతున్నాంరా, పెద్దవాళ్ళం అయి పోయాంగా. వంట్లో మిగిలి వున్న ఈ కాస్త శక్తీ నశించిపోకముందే నాలుగు ప్రదేశాలు తిరిగి పుణ్యక్షేత్రాలు, పుణ్యతీర్థాలు దర్శించాలని అనుకుం టున్నాం. టిక్కెట్లు కూడా తెచ్చాను. బట్టలు సర్దమని చెప్పు. రాత్రికే ప్రయాణం'' అన్నాడు. ఈ అకస్మాత్ ప్రయాణానికి కారణం ఏమిటో అర్థం కాక అందరూ ఆశ్చర్యపోతుంటే భానుమతమ్మ ఒక్కతే అన్నీ అర్థమయిన దానిలా బోసినోటితో చిరునవ్వు నవ్వింది.

★



## సుమన్ విడిపోయింది

ఐదేళ్లుగా పెళ్లి చేసుకోకుండానే కలిసి జీవించిన రాహుల్‌రాయ్-సుమన్ రంగనాథ్‌లు చిట్టచివరకు విడిపోయారు. విడిపోవడానికి కారణం ఏమిటి? అన్న ప్రశ్నకు సుమన్ రంగనాథ్ జవాబు చెప్పింది ''నేను సతీసావిత్రినో లేదా ఇంకా కన్యగానో వున్నానని అబద్ధాలు చెప్పి ఇతరులను మోసపుచ్చాలనుకోవడంలేదు. అలాగని విచ్చలవిడిగా తిరగడం నా అభిమతం కాదు. సల్మాన్‌ఖాన్, శరద్‌కపూర్‌లు నాకు మంచి స్నేహితులు మాత్రమే. ఆ స్నేహాన్ని అపార్థం చేసుకుని మా మధ్య ఏదో జరిగి వుంటుందని అనుమానించేవారికి నా నిర్దోషిత్వాన్ని ఎలా రుజువు చేసుకోగలను? అసలు సల్మాన్, సొహైల్ ఇద్దరూ అన్నదమ్ములయితే వాళ్లిద్దరితో సంబంధం పెట్టుకునేంత చీప్ మెంటాలిటీ నాకులేదు''. ఆమె స్టేట్‌మెంట్ వెనుక అసలు విషయం ఏమిటో అర్థమైంది కదా. ప్రస్తుతం సుమన్ తన సొంత అపార్ట్‌మెంట్‌కి మారి అక్కడ ఒంటరిగా వుంటోందట. ఆనందం అలవాటయ్యాక ఒంటరిగా వుండిపోవడం ఎక్కువకాలం సాధ్యపడే విషయం మాత్రంకాదు. ఆ విషయం సుమన్‌కే తెలుసు.

-జె.వి.బాబు